క్లుప్తంగా

నిత్యావసరాలు పంపిణీ



గోపాల్‌కు సరుకులు అందజేస్తున్న రవినాయక్

నల్లగొండ టౌన్: కండరాల క్షీణత వ్యాధితో బాధపడుతున్న నల్లగొండ పట్టణానికి చెందిన జంపాల గోపాల్ దీనస్థితి తెలుసుకున్న హార్టు టు హెల్ప్ చారిటబుల్ ట్రస్టు స్పందించింది. శుక్రవారం ట్రస్టు అధ్యక్షుడు రవినాయక్ సాగర్ రోడ్డులోని గోపాల్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు రూ.6వేల విలువ చేసే నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాల్ కండరాల క్షీణిత వ్యాధితో మంచానికే పరిమితం కావడం దురదృష్టకరమన్నారు. తల్లే అన్నీ తానై కొడుక్కు సేవలు చేయడం తమను కలిచివేస్తుందన్నారు. దాతలు ముందుకు వచ్చి గోపాల్‌ను ఆదుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొమరవోలు సంగీత, కామల్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు ఏడీఏగా వేణుగోపాల్



మునుగోడు: ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా మునుగోడు డివిజన్ ఏడీఏగా వేణుగోపాల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడా పనిచేసిన ఏడీఏ ఎల్లయ్య కోదాడకు బదిలీ కాగా సూర్యాపేటలో పనిచేస్తున్న వేణుగోపాల్ మునుగోడుకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కార్యాలయ సిబ్బందితో పాటు పలువురు రైతులు, వివిధ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఏఓ బాధ్యతలు స్వీకరణ



పద్మజ, ఏఓ

మండల వ్యవసాయ అధికారిగా పద్మజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాస్‌గౌడ్ యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలానికి బదిలీ కాగా, ఆలేరు మండల అధికారిగా పనిచేస్తున్న పద్మజకు ఇక్కడికి స్థానచలనం కలిగింది.

సంతోషిమాత ఆలయంలో లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని పాత బస్తీ సంతోషిమాత ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. సంతోషిమాత అమ్మవారిని పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులందరూ లలితా సహస్రనామ పారాయణంలో పాల్గొన్నారు.

ఆలయం వద్ద భక్తుల కోలాహలం

కనగల్ : మండల పరిధిలోని దర్వేశిపురం స్టేజి వద్ద గల శ్రీ రేణుక అమ్మవారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మహిళా భక్తులు కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు.

కనకదుర్గా ఆలయంలో పుష్పాభిషేకం



పుష్పాభిషేకం నిర్వహిస్తున్న భక్తుల

చిట్యాల: పట్టణంలోని శ్రీకనకదుర్గా ఆలయంలో శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ రిటైర్డ్ ప్రధాన అర్చకులు కారంపూడి నర్సింహాచార్యులు ఆధ్వర్యంలో శ్రీకనకదుర్గా అమ్మవారికి పుష్పాభిషేకం నిర్వహించారు. పుష్పాభిషేకానికి సహకరించిన దాతలు కందిమళ్ల రేణుక శిశుపాల్‌రెడ్డి, ఎడ్ల సతీష్, పల్లె నరేందర్‌రెడ్డిలకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్‌లు, భక్తులు పాల్గొన్నారు.

డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్ ఆమోదించాలి

మర్రిగూడ : డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్ ఆమోదించి పర్యావరణ, అటవీశాఖ అనుమతులు ఇవ్వాలని సీపీఎం నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం 3వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు సీపీఎం నాయకులు తహసీల్దార్ బక్క శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ డిండి ప్రాజెక్టు పరిధిలోని సింగరాజుపల్లి, గొట్టిముక్కల, కిష్టరాయన్‌పల్లి, శివన్నగూడ రిజర్వాయర్ల కాల్వ పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో నీలకంఠం రాములు, కొట్టం యాదయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ పునరుద్ధరణ





నల్లగొండలోని హైదరాబాద్ రోడ్ ఉడిపి హోటల్ వద్ద రెడ్ సిగ్నల్ పడడంతో నిలిచిన వాహనాలు, నాగార్జున డిగ్రీ కళాశాల వద్ద..

- నీలగిరిలో ఏడు ప్రధాన కూడళ్లలో అమల్లోకి..
- ఇష్టారీతిన ప్రయాణించే వాహనదారులకు కళ్లెం
- నిబంధనలు అతిక్రమిస్తే రూ.వెయ్యి జరిమానా

నల్లగొండ క్రైం : జిల్లా కేంద్రంలో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఇటీవల ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పునరుద్ధరించారు. గతంలో సిగ్నల్స్ లేకపోవడంతో వాహనదారులు ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులోకి రావడంతో వాహన దారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

పెరిగిన వాహనాల రద్దీ

జిల్లా కేంద్రంలో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. రోజురోజుకు పట్టణ విస్తీర్ణం పెరిగిపోతోంది. ప్రధానంగా చదువులు, ఉపాధి నిమిత్తం జిల్లా కేంద్రానికి సమీప మండలాల ప్రజలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది.



పెద్ద గడియారం సెంటర్‌లో గ్రీన్ సిగ్నల్ పడడంతో వెళ్తున్న వాహనాలు

ముఖ్యంగా పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభ సమయంలో వాహనాల రద్దీ విపరీతంగా కనిపిస్తోంది. త్వరగా గమ్యస్థానాలకు చేరాలనుకునే వారు అడ్డగోలుగా ప్రయాణించడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుతో అలాంటి వారికి కళ్లెం వేసినట్లయ్యింది.

ఎక్కడెక్కడంటే..

పట్టణంలోని ఏడు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులోకి వచ్చాయి. క్లాక్‌టవర్ సెంటర్, డీఈఓ కార్యాలయం, దేవరకొండ రోడ్డులోని మునుగోడు సర్కిల్, హైదరాబాద్ రోడ్డులోని ఉడిపి హోటల్ వద్ద, ఎన్‌జీ కాలేజీ, ఎన్‌టీఆర్ విగ్రహం, సుభాష్ విగ్రహం తదితర కూడళ్లలో సిగ్నల్స్ ఏర్పాటు చేయించారు. సిగ్నల్స్ జంప్ చేసి వెళ్లే వాహనాలను సంబంధిత పోలీసులు గుర్తించి సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి ఆన్‌లైన్‌లో రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సురక్షితంగా గమ్యస్థానానికి చేరేందుకు ప్రతి వాహనదారుడు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. ఎవరైనా అతిక్రమిస్తే సీసీ కెమెరాల ద్వారా గుర్తించి ఆన్‌లైన్‌లో జరిమానా విధిస్తాం. రోడ్డు ప్రమాదాలన్నీ మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయి. అన్ని కళాశాలల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం.

– శివరాంరెడ్డి, డీఎస్పీ, నల్లగొండ

రాత్రి 10గంటలు దాటితే..

రాత్రి 10గంటలు దాటిందంటే కొందరు ఆకతాయిలు పట్టణంలో అత్యంత వేగంగా వెళ్తూ, పెద్ద శబ్దంతో హారన్ కొడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు. బైక్‌లతో స్టంట్లు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. క్లాక్ టవర్, హైదరాబాద్ రోడ్డు, దేవరకొండ రోడ్డులో పోకిరీల ఆగడాలు ఎక్కువయ్యాయని పేర్కొంటున్నారు. సీసీ కెమెరాల ద్వారా వీరిని గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. పాఠశాలల ప్రారంభ సమయంలో సిగ్నల్స్ వద్ద పోలీసులను ఉంచి మైక్ ద్వారా నిబంధనలపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

యువత సందేశాత్మక చిత్రాలు తీయాలి

- నల్లగొండ ఏఎస్పీ రాములునాయక్



ట్రైలర్ విడుదల చేస్తున్న ఏఎస్పీ రాములునాయక్

నల్లగొండ క్రైం: యువత మంచి సందేశాత్మక చిత్రాలు తీయాలని నల్లగొండ అదనపు ఎస్పీ రాములు నాయక్ అన్నారు. శుక్రవారం నల్లగొండలో ఆయన నివాసంలో నల్లగొండకు చెందిన నటులు నటించి నిర్మించిన లైఫ్ షార్ట్ ఫిలిం ట్రైలర్‌ను స్థానిక కౌన్సిలర్, నటుడు పూజిత శ్రీనివాస్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పెడదోవ పట్టకుండా ఇలాంటి సందేశాత్మక చిత్రాలు తీయాలన్నారు. కార్యక్రమంలో చిత్ర దర్శకులు నాగసూర్య , నిర్మాత చిక్కుల్ల యాదగిరి, మహిళా నాయకురాలు స్వరూప రెడ్డి , నటులు చంద్రశేఖర్ రెడ్డి, శేఖర్ శివకోటి, మిర్యాల శివ, తవిటి రామ్మూర్తి, ఎ. గోవింద్ రెడ్డి, దుర్గ బాబు, సునీల్, పవన్, భారతీయుడు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

కనగల్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని ప్రేమగా పెంచితేనే భవిష్యత్ తరాలకు ప్రాణవాయువునిస్తాయని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. కనగల్ మండలం జి.యడవల్లి గ్రామంలో శుక్రవారం నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద కార్యక్రమానికి ఆయన హాజరై మొక్కలు నాటి మాట్లాడారు. డీఆర్‌డీఓ తన సొంత గ్రామంలో కార్యక్రమానికి హాజరు కావడంతో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పూల బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం, ఏపీఎం సుధాకర్, ఈసీ, టీఏలు, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏలు పాల్గొన్నారు.

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి భాష మార్చుకోవాలి
- బీఆర్‌ఎస్ నాయకుల తీరు మారకపోతే మేమేంటో చూపిస్తాం
- మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ : బీఆర్‌ఎస్ నాయకులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివారెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి హెచ్చరించారు. ముఖ్యంగా నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి భాష మార్చుకోకపోతే బడితపూజ తప్పదన్నారు. శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గడియారం సెంటర్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మంత్రి వెంకట్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై వారు తీవ్రంగా మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో మాట్లాడే, ధర్నాలు చేసే హక్కు ఉందని, వ్యక్తిగత దూషణలు సరికావన్నారు. ఈసారి వ్యక్తిగతంగా మాట్లాడితే మేమేంటో చూపిస్తామని హెచ్చరించారు. ప్రజలు చీదరించుకుని ఓడించినా మార్పు రాలేదన్నారు. తమను కాంగ్రెస్ గుండాలంటూ ఆరోపిస్తున్నారని, తాము ఎక్కడ రౌడీయిజం చేశామో ఒక ఉదాహరణ చెప్పాలన్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఎంపీగా, ప్రస్తుతం మంత్రిగా ఎన్నో అభివృద్ధి పనులు చేశాడన్నారు. రూ.600కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నల్లగొండ, తిప్పర్తి, కనగల్ మాజీ జెడ్పీటీసీలు వంగూరి లక్ష్మయ, పాశం రాంరెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పాశం సంపత్‌రెడ్డి, మనిమద్దె సుమన్, ఖయ్యూంబేగ్, వేణుగోపాల్‌రెడ్డి, జూలకంటి శ్రీనివాస్, వంగాల అనిల్‌రెడ్డి, ఏర్పుల రవి, కత్తుల కోటి, గురిజ వెంకన్న, నాగేశ్వర్‌రావు, జూలకంటి సైదిరెడ్డి, గాలి నాగరాజు, వెంకన్న, గణేష్, మామిడి కార్తీక్, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కేతేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వంట ఏజెన్సీలు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్, మండల స్పెషల్ ఆఫీసర్ నాగేశ్వరావు ఆదేశించారు. కేతేపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. వంట చేసే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సరుకుల నిల్వలను, కేంద్రాల్లో నమోదైన చిన్నారులు, గర్భిణులు, బాలింతల రికార్డులను పరిశీలించారు.



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ నాగేశ్వరావు

ఆయన వెంట ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఎంపీఓ నాగలక్ష్మి, సివిల్ సప్లయిస్ డీటీ దీపక్, క్వాలిటీ కంట్రోల్ అధికారి నరేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

అధ్యాపకుడికి అభినందనలు

రామగిరి(నల్లగొండ): ఢిల్లీలో జరిగిన 78వ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న ఎన్జీ కళాశాల అధ్యాపకుడు, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ కో ఆర్డినేటర్ నర్సింగు కోటయ్యను శుక్రవారం ఆ కళాశాలలో సిబ్బంది అభినందించారు. వేడుకల్లో కళాశాలకు చెందిన 16 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు కోటయ్య నాయకత్వం వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పరంగి రవి, డాక్టర్ సురేష్, సీఓఈ బి. నాగరాజు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని తహసీల్దార్‌కు వినతి

శాలిగౌరారం: గడిచిన అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ యాదగిరికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కాలపరిమితి లేకుండా రూ.2 లక్షల రుణాలు పొందిన రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, నాయకులు మక్క బుచ్చిరాములు, సైదుల శ్రీను, జగన్, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

రైతుల రుణాలు మాఫీ చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం, రైతు సంఘం నాయకులు

చిట్యాల: ఆంక్షలు లేకుండా రైతులందరి రుణాలు పూర్తిస్థాయిలో మాఫీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల రుణాలను మాఫీ చేయాలని కోరుతూ చిట్యాలలోని రైతు వేదిక ఎదుట శుక్రవారం సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతులకు రెండు లక్షల రూపాయలు మాఫీ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు వడ్డీతో కలిపి రెండు లక్షలలోపు రుణాలను మాఫీ చేయాలన్నారు. అనంతరం వారు ఏఈఓ మనీషాకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు అర్రూరీ శ్రీను, సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, మండల నాయకులు కత్తుల లింగస్వామి, శీలా రాజయ్య, గుడిసె లక్ష్మీనారాయణ, రైతు సంఘం మండల అధ్యక్షుడు లడే రాములు, మెట్టు నర్సింహ, అర్రూరీ నర్సింహ, సుర్కంటి బుచ్చిరెడ్డి, సత్తయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



వట్టిమర్తి జెడ్పీ హెచ్‌ఎస్‌లో బదిలీపై వెళ్తున్న టీచర్లను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి జెడ్పీ హెచ్‌ఎస్‌లో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శుక్రవారం ఆ పాఠశాల ఆవరణలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు పొట్టబత్తుల రామకృష్ణ, డోకూరు శ్రీనివాస్‌రెడ్డి, బయ్యరాజు, శీలం మధుసూదన్, ఆఫీస్ సబార్డినేట్ బి.జయశ్రీలను ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం పందిరి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్ పర్సన్ మేడి శ్రీలత, ఉపాధ్యాయులు శేపూరి నర్సింహ, ఎన్.యాదయ్య, పెరుమాళ్ల ఆనంద్, సూర్యప్రకాష్, నీరజ, చంద్రయ్య, అనీస్ ఫాతీమా, నర్సింహ, పెంటయ్య, హంస తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

మర్రిగూడ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదావత్ లచ్చిరాం డిమాండ్ చేశారు. శుక్రవారం గత ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని అమలు చేసిన ఆగస్టు 23న చీకటి రోజుగా భావిస్తూ మండలంలోని దామెరబీమనపల్లి జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంజీవరావు, సికిందర్, కొండ శ్రీను పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఎదుట టీఎస్‌యుటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు అభిలాష్, విజయలక్ష్మి, సతీష్‌రాజ్, వెంకటేశ్వర్లు, శ్రీను, మీనాకుమారి, విజయ్‌కుమార్, నస్రీన్ పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కట్టంగూర్ : ర్యాలీ నిర్వహిస్తున్న మండల సమాఖ్య మహిళలు, అధికారులు

నకిరేకల్ : యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. గంజాయిని నిర్మూలించాలని కోరుతూ నకిరేకల్‌లో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెయిన్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు కృషిచేయాలి

కట్టంగూర్ : డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు కోరారు. కట్టంగూర్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో మత్తుపదార్థాలను పూర్తిగా నిర్మూలించాలని కోరుతూ శుక్రవారం మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గంజాయి వాడకం వల్ల యువత పెడతోవ పట్టి అనేక సంఘ విద్రోహక చర్యలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. డ్రగ్స్, గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎన్ శ్రీను, ఏపీఎం కస్సరాజు సైదులు, ఏపీఓ రాంమోహన్, మండల సమాఖ్య అధ్యక్షురాలు చైతన్య, సీసీ శంకర్, వెంకన్న, మల్లేశ్వరి ఉన్నారు.

నార్కట్‌పల్లిలో..



నకిరేకల్: ర్యాలీలో పాల్గొన్న అధికారులు, పోలీసులు

నార్కట్‌పల్లి : గంజాయిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ సుధాకర్, డీపీఎం మోహన్‌రెడ్డి, ఏపీఎం శ్రీదేవి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

మెనూ అమలు చేయాలి

చండూరు : మధ్యాహ్న భోజన పథకంలో మెనూ కచ్చితంగా అమలు చేయాలని ఏఎస్‌ఓ రాజశేఖర్ అన్నారు. చండూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎడ్ల భిక్షం, డీటీసీఎస్ జ్యోత్స్న ఉన్నారు.

చిప్పలపల్లి అధ్యక్షుడిగా వాసు

నార్కట్‌పల్లి: మండలంలోని చిప్పలపల్లి గ్రామ కల్లు గీత పారిశ్రామిక సహకర సంఘం నూతన కమిటీని జిల్లా కో–ఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ దశరథ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పనస వాసు ఉపాధ్యక్షుడిగా బత్తిని రమేష్, కార్యదర్శిగా పనస ధనంజయ్య, డైరెక్టర్లుగా రామ నరసయ్య, జిడికల్లు, రమేష్, శంకరయ్య, చిన్న శేఖర్, నోముల కరుణాకర్‌లను ఎన్నుకున్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

చండూరు(గట్టుప్పల్) : డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్ ఆమోదించి .. పర్యావరణ అనుమతి ఇవ్వాలని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు బండ శ్రీశైలం కోరారు. అన్నారు. డీపీఆర్‌ను ఆమోదించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు నాలుగో రోజుకు చేరాయి. దీక్షలకు బీఆర్‌ఎస్ నాయకులు ఇడెం కైలాసం, మలిగే శ్రీశైలం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కర్నాటి మల్లేశం, చాపల మారయ్య, కర్నాటి సుధాకర్, విశ్వనాథచారి పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ

నల్లగొండ టౌన్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యను నిరసిస్తూ జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి గడియారం సెంటర్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ అత్తుల ఈశ్వర్ కుమార్, అలీముద్దీన్, రాజశేఖర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, యాదయ్య, స్వామి, రాజు, శ్రీనివాస్ నాగార్జున, సంధ్య, చందన, నీలమ్మ, భాగ్యలక్ష్మి, మాధవి, ఉష పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

మర్రిగూడ : మండలంలోని తమ్మడపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నాంపల్లి మండలం లింగోటం గ్రామానికి చెందిన యూత్ సభ్యులు మిరియాల రంజిత్‌కుమార్ శుక్రవారం నోట్ బుక్స్, పెన్నులు, ఇతర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గొట్టిముక్కుల ప్రకాశ్ పాల్గొన్నారు.

వెల్మకన్నె ఫీడర్ చానల్ పనులు పూర్తిచేయాలి

చండూరు : వెల్మకన్నె ఫీడర్ చానల్ పనులు పూర్తి చేయించాలని కోరుతూ చండూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన కొమ్ము గణేష్ కొంత మంది రైతులతో కలిసి శుక్రవారం అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌కు వినతిపత్రం అందించారు. 2014వ సంవత్సరంలో ఫీడర్ చానల్ పనులు ప్రారంభించి నిలిపివేశారని, తిరిగి పునరుద్ధరించాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

శాలిగౌరారం: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ తమ ఇంటి పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి అన్నారు. శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని బాలిశెట్టిగూడెంలో పంచాయతీ, వైద్య సిబ్బందితో కలిసి శుక్రవారం ప్రజల ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. ఆమె వెంట మండల పంచాయతీ అధికారి పద్మ, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

ఎంజీ యూత్ అధ్యక్షుడిగా నర్సిరెడ్డి



చిట్యాల : పట్టణంలోని ముత్యాలమ్మగూడెం (ఎంజీ) యూత్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం జరిగిన సమావేశంలో ఆ సంఘం సలహాదారులు ఏళ్ల మల్లేశం, బెల్లి సత్తయ్య, బొడ్డుపల్లి చంద్రశేఖర్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్ గౌరవాధ్యక్షుడిగా కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, అధ్యక్షుడిగా నల్ల నర్సిరెడ్డి, ఉపాధ్యక్షులుగా కొంపల్లి రవి, నల్ల మహేందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా కమ్మంపాటి మల్లేష్, కోశాధికారిగా దేవనబోయిన సైదులు, సహాయ కార్యదర్శులుగా సిరసనవాడ కృష్ణ, దమ్మాల నరేందర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా సిలివేరు కిరణ్, కార్యవర్గ సభ్యులుగా చింతకుంట్ల తిరుపతిరెడ్డి, మల్లేష్, నరేష్ ఎన్నికయ్యారు.

రేపు శ్రీనగర్ కాలనీలో బోనాల పండుగ

నల్లగొండ రూరల్ : పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఆదివారం ముత్యాలమ్మ బోనాల పండుగ నిర్వహిస్తున్నట్లు బెస్త సేవా సంఘం నాయకుడు గుండు వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

డబుల్‌రోడ్డు బీటీ పనులు ప్రారంభం



శాలిగౌరారం-రామగిరి డబుల్‌రోడ్డుపై బీటీపనులు చేస్తున్న యంత్రాలు

శాలిగౌరారం: మండలంలో సింగిల్‌రోడ్డుగా ఉన్న శాలిగౌరారం – గురుజాల ప్రధాన ఎండీఆర్(మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్డు) ఆర్‌అండ్‌బీ సింగిల్ రోడ్డును సీఆర్ఐఎఫ్(సెంట్రల్ రోడ్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్) నిధుల నుంచి రూ.5 కోట్ల వ్యయంతో రామగిరి వరకు 2.1 కిలోమీటర్లు డబుల్‌రోడ్డుగా అభివృద్ధి పరిచేందుకు బీటీ నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇప్పటికే రోడ్డు నిర్మాణానికి సంబంధించిన మట్టి, కంకర పనులు పూర్తికావడంతో బీటీ వేసే పనులను ప్రారంభించారు. రూ. 5 కోట్లు నిధులతో చేపట్టిన డబుల్‌రోడ్డు నిర్మాణంలో 1.60 కిలోమీటర్లు బీటీ డబుల్‌రోడ్డుతో పాటు శాలిగౌరారం బస్టాప్ సమీపంలో బాక్స్‌బ్రిడ్జి, రామగిరిలో 400 మీటర్లు పొడవు సీసీతో డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రోడ్డు నిర్మాణానికి అంతరాయంగా మారిన విద్యుత్ స్తంభాలను విద్యుత్ అధికారులు తొలగించారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవం



ఉరుమడ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో విక్రమ్‌సారాబాయ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామ జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయులు ఏషమల్ల నాగయ్య, సిర వరుణకుమారి ఆధ్వర్యంలో డాక్టర్ విక్రమ్‌సారాబాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంతరిక్ష పరిశోధన రంగంలోని వివిధ దశలు, పరిణామ క్రమాలు, అంతరిక్ష పరిశోధన సంస్థ సాధించిన విజయాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. రాకెట్ల ప్రయోగ విధానం ,ఉపగ్రహాల పనితీరు, అంతరిక్షంలో గురుత్వాకర్షణ లేని ప్రదేశంలో శాస్త్రవేత్తల జీవన విధానం వంటి విషయాలను దృశ్య, శ్రవణ పద్ధతిలో, వీడియో రూపంలో విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌కె.లతీఫ్, రజిత, సైదులు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.